# యాదగిరిగుట్టలో వైభవంగా కల్యాణోత్సవం



యాదాద్రిలో లక్ష్మీనరసింహుల తిరు కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని అర్చకులు సోమవారం ఘనంగా జరిపించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో కల్యాణ మూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి సేవను కొనసాగించారు. తూర్పునకు అభిష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరు కల్యాణోత్సవం జరిపించారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామి వారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే ప్రారంభమయ్యాయి. ఉదయం 3.30గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన, నిజాభిషేకం నిర్వహించి భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను గరుఢ, తిరుచ్చీ వాహనాలపై వేంచేపు చేసి ఆలయ మాఢ వీధుల్లో సేవను ఊరేగించారు. రాత్రి దర్బార్, నివేదన, శయనోత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. రామలింగేశ్వర కుటుంబంతో పాటు స్పటిక లింగేశ్వరుడికి ప్రభాత వేళ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని సుమారు గంటన్నర పాటు నిర్వహించారు. సాయంత్రం రామలింగేశ్వరుడికి సేవను శివాలయ మాఢవీధుల్లో ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ. 23,56,323 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.

# నేడు హుజూర్‌నగర్‌కు సీఎం కేసీఆర్

- పట్టణంలో సభ నిర్వహణ
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి
- స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్న జనం



హుజూర్‌నగర్ ప్రజా ఆశీర్వాద సభకు సిద్ధమైన వేదిక

నేరేడుచర్ల, అక్టోబర్ 30 : గులాబీ దళపతి, సీఎం కేసీఆర్ మంగళవారం సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. ముందుగా హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ సభలకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో మూడు నియోజకవర్గాల్లో సభా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, రమావత్ రవీంద్రకుమార్ దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలిరానున్నారు.

### హుజూర్‌నగర్‌లో 70వేల మందికి ఏర్పాట్లు

హుజూర్‌నగర్ పట్టణంలోని సాయిబాబా థియేటర్ సమీపంలోని గ్రీన్‌వుడ్ స్కూల్ వద్ద గల ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన సభలో సుమారు 70వేల మంది ప్రజలు కూర్చునేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఉప ఎన్నికలో గెలిచాక సీఎం కేసీఆర్ హాజరైన కృతజ్ఞత సభ, నియోజకవర్గంలో జరిగిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చిన సమయంలో ఇదే స్థలంలో సభను ఏర్పాటు చేశారు. అదేవిధంగా వీఐపీలు, జర్నలిస్టులు, మహిళలు, పురుషులు వేర్వేరుగా కూర్చునేలా బారికేడ్లను ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే ప్రజలకు వాహనాల రాకపోకలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా సభ ప్రాంగణానికి నాలుగు దిక్కులా వాహనాలు ఆపేందుకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.

### 390మందితో పటిష్ట బందోబస్తు

సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు మొత్తం 390మంది పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. డీఎస్పీలు-3, సీఐలు-8మంది, ఎస్ఐలు -29మంది, ఏఎస్ఐల, హెడ్ కానిస్టేబుళ్లు- 89 మంది, పోలీసులు, హోంగార్డులు- 242 మంది నియమించి పర్యవేక్షించనున్నారు. దానికి అనుగుణంగా కావాల్సిన సిబ్బందిని నియమించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా కోదాడ డీఎస్పీ ప్రకాశ్ యాదవ్, హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డిఫ చర్యలు తీసుకుంటున్నారు.

### పార్కింగ్ స్థలాలు

నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండలాల నుంచి వచ్చే వాహనాలను పట్టణంలోని వాసవీ భవన్ సమీపంలోని ఖాళీ స్థలంలో, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం నుంచి వచ్చే వాహనాలు వీకే వెంచర్‌లో నిలిపివేయనున్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సభా ప్రాంగణానికి సమీపంలోనే పార్కింగ్ స్థలాలు కేటాయించారు.

### ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి



హుజూర్‌నగర్‌లో మంగళవారం మధ్యాహ్నం 12: 30 గంటలకు నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరవుతున్నందున నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలి. సభలో నియోజకవర్గ అభివృద్ధి, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై సీఎం కేసీఆర్ వివరించనున్నట్లు తెలిపారు. గ్రామాల నుంచి బయలుదేరి తిరిగి ఇంటికి చేరే వరకు అందరూ జాగ్రత్తగా వచ్చి వెళ్లాలని సూచించారు.

– హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



మిర్యాలగూడ ప్రజా ఆశీర్వాద సభకు పూర్తైన ఏర్పాట్లు

# మిర్యాలగూడ ఎన్ఎస్పీ గ్రౌండ్‌లో సభ

మిర్యాలగూడ, అక్టోబర్ 30 : మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ గ్రౌండ్‌లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గం నుంచి వేలాది మంది సభకు తరలిరానున్నారు. సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 2గంటలకు సభకు హాజరై ప్రసంగించనున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఐదు మండలాలు సీఎం కేసీఆర్ రాక సందర్భంగా గులాబీ మయమయ్యాయి. అడుగడుగునా గులాబీ దళపతి భారీ కటౌట్లు ఏర్పాట్లు చేశారు. సీఎం రాకతో నియోజకవర్గానికి మరింత మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్, ఎమ్మెల్యేగా నల్లమోతు భాస్కర్‌రావు గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు.

### భారీ బందోబస్తు

సీఎం కేసీఆర్ సభకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ అపూర్వారావు భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ స్థలాలను పర్యవేక్షించారు. వాహనాల మళ్లింపు, పార్కింగ్ స్థలాల వద్ద వాహనాల నిలిపివేత వంటి అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. 400మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. 4డీఎస్పీలు, 15మంది సీఐలు, 50మంది ఎస్ఐలు, 110ఏఎస్ఐలు, మరో 300మంది కానిస్టేబుల్, హోంగార్డులతో బందోబస్తు నిర్వహించనున్నారు.

### పార్కింగ్ ప్రదేశాలు

- యాద్గార్‌పల్లి, ఆలగడప వైపు నుంచి వచ్చే వాహనాలు ఆర్డీఓ కార్యాలయం వద్ద ప్రజలను దింపి వారి అట్టి వాహనాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, పాత వడ్ల మార్కెట్‌లో పార్కింగ్ చేసుకోవాలి
- దామరచర్ల, అడవిదేవులపల్లి, వెంకటాద్రిపాలెం నుంచి వచ్చే వాహనాలు జీవీ మాల్ వరకు వచ్చి అక్కడ ప్రజలను దింపి జీవీ మాల్ పక్కన ఉన్న ఎన్‌జీ కళాశాల గ్రౌండ్, రెడ్డికాలనీ, డీమార్ట్ ఖాళీ స్థలాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.
- వేములపల్లి, మాడ్గులపల్లి మండలాల నుంచి వచ్చే వాహనాలు నందిపాడు ఎక్స్ రోడ్డు నుంచి సభా స్థలానికి చేరుకుని కార్యకర్తలను దింపి లక్ష్మీగార్డెన్ ఫంక్షన్ హాల్ సమీపంలో పార్కు చేసుకోవాలని డీఎస్పీ వెంకటగిరి సూచించారు. వాహనాల డ్రైవర్లు ప్రతి ఒక్కరు పార్కింగ్ స్థలం వద్దనే ఉండాలన్నారు.

# దేవరకొండ సభలో 80వేల మందికి ఏర్పాట్లు



దేవరకొండలో ప్రజా అశీర్వాద సభకు సిద్ధమైన వేదిక

దేవరకొండ, అక్టోబర్ 30 : దేవరకొండలో మంగళవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గంలో సుమారు 80వేల మంది వచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో మధ్యాహ్నం 3గంటలకు సభ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో సభా ప్రాంగణమంతా గులాబీమయమైంది. సీఎం కేసీఆర్ వచ్చే సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ప్రజా అశీర్వాద సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి పరిశీలించారు.

### పార్కింగ్ ప్రదేశాలు

- దేవరకొండ , నేరేడుగొమ్ము, డిండి, పీఏపల్లి, కొండమల్లేపల్లి మండలాల నుండి వచ్చే వాహనాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- చింతపల్లి మండలాలను వచ్చే వాహనాలకు మిషన్ కౌపౌండ్ సమీపంలో పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు.